జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com




ఆదివారం | 29-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 382 పేజీలు: 4 వెల: రూ.7


# 265 కోట్లతో... ఉద్దానం ఫేజ్2

* 578 గ్రామాలకు తాగునీరు అందిస్తాం
* పాతపట్నం నియోజకవర్గంలో నీటి సమస్యను పరిష్కరిస్తాం
* కేంద్ర మంత్రి రామ్మోహన్
* ఉద్దానం ప్రాజెక్టు పనులకు పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్‌తో కలిసి భూమి పూజ

**పాతపట్నం, జూన్ 28 (వార్త):** పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు మంచి నీరు అందించేందుకు మరో అడుగు పడింది. పాతపట్నం మండలం బూరగాం గ్రామంలో రూ.265 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న ఉద్దానం ఫేజ్-2 మంచినీటి పథకానికి శనివారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్దానం ఫేజ్2 పనుల ద్వారా 578 గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు. పాతపట్నం ప్రజలు అనేక దశాబ్దాలుగా మంచినీటి కొరతతో బాధపడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తాగునీటి సమస్య పరిష్కారానికి ఈ ప్రాజెక్టు ప్రధాన పరిష్కారంగా మారనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు, మండల స్థాయి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





## జూలై 2న వంశధార నీరు విడుదల

* సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి
* శివారు ప్రాంత రైతులకు సాగు నీరు అందేలా చూస్తాం
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, జూన్ 28 (వార్త):** వంశధార సాగునీటిని జూలై2న విడుదల చేయాలని, జిల్లాలో ఖరీఫ్ రైతాంగానికి అవసరమైన పూర్తి స్థాయిలో సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఖరీఫ్‌కు రైతులకు సాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నీటిపారుదల శాఖ అధికారుతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక సాగు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు అవసరమైన సూచనలు సలహాలు అందించాలన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో వంశధార కుడి ఎడమ కాలువ ఆయకట్టు నుంచి సాగునీరు రైతులకు వచ్చే నెల 2న నీరు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముందుగా రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు పెంచి శివారు ప్రాంతాలకు సైతం నీరు చేరేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగా చెరువులను నీటితో నింపాలని సూచించారు. వ్యవసాయ పనులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట అత్యవసర మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రదేశాల్లో ఉంటే వాటిని తక్షణమే తొలగించి సజావుగా సాగునీరు అందేలాచర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు స్వర్ణకుమార్, శేఖర్‌రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 29న పలాసలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, జూన్ 28(వార్త):** ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల29న పలాస తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం పలాస తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాకలెక్టర్ డా.స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు.



## మత్స్య అవతారంలో జగన్నాథుడు

**శ్రీకాకుళం, జూన్28 (వార్త):** జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవిలు మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇల్లిసిపురంలోని గుండిచా మందిరంలో స్వామివారికి విశేష అలంకరణలు చేసిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సుభాష్ చంద్ర పండా ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజులు పాటు వివిధ అవతారాల్లో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని నిర్వాహకులు బాలు పాణిగ్రాహి తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# రౌడీషీటర్లు, పాతనేరస్థులపై.. నిఘా పెంచండి



* బీట్ సిస్టమ్ అమలు చేయాలి
* 'సంకల్పం' పేరిట అవగాహన కల్పించాలి
* ప్రాపర్టీ కేసులు దర్యాప్తు వేగవంతంగా చేయండి
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
* జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష

**శ్రీకాకుళం క్రైం, జూన్ 28 (వార్త):** రౌడీ షీటర్లు, పాత నేరస్థులపై నిరంతరం నిఘా పెట్టాలని, ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని బీట్ సిస్టమ్‌ను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, బీట్ సిస్టమ్ అమలు, విజిబుల్ పోలీసింగ్, ఎన్ఫోర్స్మెంట్ వర్క్స్, సంకల్పం, నాన్ బెయిలబుల్ వారెంట్లు, గ్రేవ్ కేసులు దర్యాప్తు, అరెస్టు, ప్రాపర్టీ సిజర్స్ తదితర అంశాలపై జిల్లా ఎస్పీ నెల వారి నేర సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా న్యాయం చేయాలన్నారు. ప్రతి రోజు గ్రామాల్లో, కళాశాల, పాఠశాలలో పోలీసు అధికారులు, సిబ్బంది సందర్శించి సంకల్పం పేరిట మహిళ భద్రత, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్ధాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారన్నారు. నాన్ బెయిల్ వారెంట్స్ వీలైనంత వరకు అమలు పరిచి న్యాయస్థానంలో హాజరు పరచాలన్నారు. పెండింగ్లో ఉన్న గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి నిర్దిష్ట సమయంలో కేసు అభియోగ పత్రాలు దాఖలు చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియామాలపై అవగాహన కల్పించాలనాష్ట్రురు. రోడ్డుకు ఇరువైపుల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రాత్రి వేళల్లో గస్తీ విధులు పటిష్టంగా అమలు చేసి, వాహనాలు, లాడ్జిలలో తనిఖీలు చేపట్టి ప్రాపర్టీ నేరాల నివారణకు ప్రణాళిక బద్దంగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రాపర్టీ కేసులు చేదన, కేసు ప్రాపర్టీ రికవరీ, ముద్దాయిలు, అరెస్టు, గుడ్‌వర్క్‌తోపాటు చాకచక్యంగా చేధించిన ముఖ్యమైన కేసులలో ప్రతిభ కనబరిచిన సీఐలు టౌన్ సీఐ పైడిపు నాయుడు, సీసీఎస్ సీఐ సూర్య చంద్రమౌళి, పాతపట్నం సీఐ రామారావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు హరికృష్ణ, రాము మధుసూదన్, గోపూర్, పోలీసు హెడ్ కానిస్టేబుల్, పోలీసు కానిస్టేబుల్స్‌కు ప్రశంసా పత్రాలను ఎస్పీ అందజేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్పీలు వివేకానంద, అప్పారావు, ప్రసాద్ రావు, ఏవో గోపినాథ్, ఎస్బి సీఐ ఇమ్మన్యుల్ రాజు, డిసిఆర్బి సీఐ శ్రీనివాసరావు, సిఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుడు పరదేశి మృతి

* కాకినాడ తీరంలో బోటు నుంచి జారిపడి..
* చిన్నగణగళ్లపేటలో విషాదం

**శ్రీకాకుళం క్రైం, జూన్28 (వార్త):** సంతబొమ్మాళి మండలానికి చెందిన మత్స్యకారుడు ఇటీవల సంద్రంలో బోటు బోల్తా ఘటనలో మృతి చెందిన ఘటన మరువక ముందే మరో విషాదం చోటు చేసుకుంది. శ్రీకాకుళం రూరల్ మండలంలోని చిన్నగనగళ్ల పేట గ్రామానికి చెందిన చిడిపిల్లి పరదేశి(48) కాకినాడ తీరంలో బోటులో సంద్రంలో వేట చేస్తూ జారిపడి మృతి చెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చీడిపల్లి పరదేశి ఉపాధి నిమిత్తం కాకినాడకు వెళ్లాడు. శుక్రవారం రాత్రి తోటి మత్స్యకారులు ఆరుగురితో కలిసి బోటులో కాకినాడ సముద్రంలోకి వేటకు వెళ్లాడు. వేట జరుగుతుండగా బోటులో నుంచి కాలు జారి సముద్రంలో పడి గల్లంతయ్యాడు. శనివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కాకినాడ హార్బర్‌కు మృతదేహం కొట్టుకొచ్చింది. పరదేశికి భార్య కొర్లమ్మ, కుమారుడు కార్తీక్ ఉన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మత్స్యావతారంలో జగన్నాథుడు

**ఇచ్ఛాపురం, జూన్ 28(వార్త):** ఇచ్ఛాపురంలోని గుండీచా మందిరంలో వేం చేసి ఉన్న జగన్నాథస్వామి శనివారం మత్స్య నారాయణుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కూర్మ నారాయణస్వామిగా బలభద్ర స్వామి దర్శనమిచ్చారు. చిన్న జగన్నాథస్వామి మత్స్య నారాయణ అవతారంలో పూజలు అందుకున్నారు.



# లింగ నిర్ధారణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, జూన్ 28(వార్త):** మహిళా శిశు సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలులో కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన సలహా కమిటీ సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. పురుష సంతాన ప్రాధాన్యం, ఆడపిల్లలపై వివక్ష, మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలి. గర్భంలో లింగ నిర్ధారణ చేసి గర్భస్రావానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ నిర్వహించిన సర్వే ప్రకారం 2019-21 మధ్య 1000 మందికి పురుషులకు 1163 మంది స్త్రీలు ఉన్నట్లు పేర్కొన్నారు. 0-6 ఏళ్ల బాలికల లింగ నిష్పత్తి పెంపుతో పాటు, పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలును మరింత పటిష్ఠంగా కొనసాగించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా.అనిత మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 16 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించామని, లింగ నిర్ధారణ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



**పటిష్టంగా ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సేవలు**

ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా పేద ప్రజలకు సత్వరం వైద్య సేవలనందించే విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. పథకం సమగ్ర నిర్వ హణపై కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య సేవకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పథకం ఫలితాలను వంద శాతం పేదలకు అందే విధంగా అధికారులు కృషిచేయాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం అమలులో ఆరోగ్య మిత్రల పాత్ర కీలకమైందన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని, రోగుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని, సేవాభావంతో ముందుకెళ్లాలన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా 387 కేసులలో అభిప్రాయం కోరగా 20 కేసుల్లో ప్రైవేట్ ఆసుపత్రులు డబ్బులు వసూలు చేశాయని ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీసీహెచ్ఎస్ డా.కళ్యాణ్ బాబు, డీఐఓ డా.రామ్‌దాస్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డా.మేరీ కాథరిన్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డా.వెంకట్రావు, డీపీఎంవో డా.బి. రవీంద్ర, ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జీవీ లక్ష్మి, డా.స్వర్ణలత, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రతినిధి ఎన్.ప్రసాదరావు, డిప్యూటీ డీఈఎంఓ వెంకటేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాష్‌రావు, కిమ్స్ ఆసుపత్రి ఏవో సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టండి

**-వ్యవసాయ శాఖ అధికారులకు**
**మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం**



**కోటబొమ్మాళి, జూన్ 28(వార్త):** ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానంగా రైతులు ఖరీఫ్ సాగుకోసం అవసరమైన విత్తనాలు సకాలంలో అందించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానంగా రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు బారులు తీరకుండా నిరంతరాయంగా వారికి అవసరమైన విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాల న్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో పాటు, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగు నీరందించేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే ఎరువులు, విత్తనాలు అందించడానికి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో దూర ప్రాంతాలు వెళ్లి ఎరువుల తీసుకోవడం రైతులకు కష్టమని, వారికి అనువైన ప్రదేశాల్లో రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులు అందించాలని సూచించారు. సాగుకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటును అందిస్తామన్నారు. రైతుకు పెట్టుబడి సాయం కింద అర్హత ఉన్న వారికి అన్నదాత సుఖీభవ అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కింజరాపు హరిప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు జగన్మోహన్‌రావు, గోవిందరావు, అప్పారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

**పలాస, జూన్ 28(వార్త):** తమ సమస్యలు పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరసన శనివారానికి మూడో రోజుకి చేరింది. గాంధీ విగ్రహం వద్దకు కార్మికులందరూ చేరుకుని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భగవతి రోడ్, ఓల్డ్ యన్ హెచ్ 5 రోడ్, మూడు రోడ్ల కూడలి, పాత బస్టాండ్ మీదుగా ర్యాలీ చేపట్టారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్.గణపతి, యూనియన్ నాయకులు సీహెచ్ మురగన్, కె.వెంకట్ మాట్లాడుతూ పీఎఫ్ బకాయిలు చెల్లించాలని, చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యు లకు ఉద్యోగం, పనిముట్లు ఇవ్వాలని, కొవిడ్‌లో పని చేసిన కార్మికులకు 14 నెలల జీతాల బకాయిలు చెల్లించాలని, డిమాండ్ చేశారు.

శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యల పరిష్కారంపై చర్చించాలని కోరినా చర్చించక పోవడం శోచనీయమన్నారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకు, రాతపూర్వ కంగా హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బి.కూర్మారావు, యం.రవి, పి.బాలకృష్ణ, కె.ఈశ్వరరావు, యస్.తిరుపతి, ఢిల్లీ, ప్రకాష్‌ముఖి, యస్.శంకర్, యస్.లక్ష్మి, ఉషా, గులాబీ, యస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.






## ఐపీఎల్ ప్లేయర్ విజయ్‌ను అభినందించిన అచ్చెన్న

**కోటబొమ్మాళి, జూన్ 28(వార్త):** ఇటీవల జరిగిన ఇండియన్ ప్రీమియం లీగ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన టెక్కలికి చెందిన వర్ధమాన ఆటగాడు త్రిపురాన విజయ్‌ను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో క్రికెట్ క్రీడలో మరింతగా ప్రతిభ కనబరచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని, దేశం తరపున ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. నిరంతర కఠోర సాధనతో మరింత ఉన్నతంగా రాణించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో విజయ్ తల్లిదండ్రులు త్రిపురాన కృష్ణంరాజు, లావణ్య, వినయ్ తదితరులు ఉన్నారు.

## సీదిరికి ధన్యవాదాలు తెలిపిన వైసీపీ నేతలు



**పలాస, జూన్ 28(వార్త):** పలాస నియోజకవర్గంలోని మూడు మండలాలు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలకు పార్టీ కమిటీలను శుక్రవారం నియమించారు. పలాస మండలానికి సంబంధించి వైస్ ప్రెసిడెంట్లుగా రౌతు శంకరరావు, బొడ్డు సుధాకర్, జనరల్ సెక్రటరీలుగా పోతనపల్లి మాధవరావు, కొర్ల సంతోష్, గొండు మోహనరావు, కొర్ల మురళీక్రిష్ణ, కార్యదర్శులుగా శిష్టు తేజ, వంకల షణ్ముఖరావు, ఖగేష్ దొర, బొడసింగి ధనుంజయ నియమించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుని వారు కలిసి ధన్యవాదాలు తెలిపారు. జగన్, ధర్మాన కృష్ణదాస్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

## రేషన్ కార్డులు మంజూరు చేయండి



**సరుబుజ్జిలి, జూన్ 28(వార్త):** రేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడీపీ నాయకుడు ఉప్పాడ యాకాసిరావు సరుబుజ్జిలి మండల తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. మతలాబు పేట గ్రామానికి చెందిన సుమారు 50 మంది లబ్ధిదారులు రేషన్ కార్డులు మంజూరు గాక ఇబ్బందులు ఎదుర్కొటున్నారని, తక్షణం రైస్ కార్డులు మంజూరు చేయాలన్నారు. మండలంలో మొత్తం 680 కార్డు పెండింగ్ లో ఉన్నాయన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దారు మధుసూదనరావు మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ ఈ కేవైసీ చెక్ చేసి, అర్హులందరికీ రైస్ కార్డులు త్వరతగతిన మంజూరు చేస్తామన్నారు

## అనాథ ఆడపిల్లల సంరక్షణ ప్రభుత్వ ధ్యేయం

**పలాస, జూన్ 28(వార్త):** అనాథ ఆడపిల్లల సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని , బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో కె.పార్వతి అన్నారు. శనివారం కాశీబుగ్గ-పలాసకు చెందిన అంగన్‌వాడీ టీచర్లతో రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న అంగన్‌వాడీ సెంటర్లో సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పాన్సర్ స్కీమ్స్‌పై వివరించారు. చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ కె.శివాజీ మాట్టాడుతూ చైల్డ్ లైన్ ఎలా పని చేస్తుందో వివరించారు. ఏదైనా సమస్య ఉంటే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. బాలల రక్షణ విభాగం సోషల్ వర్కర్ ఐ.జనార్దన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా క్షేత్రస్థాయిలో ఏ విధంగా పనిచేయాలో సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.గంగమ్మ, రైల్వే చైల్డ్ హెల్ప్‌డెస్క్ సూపర్‌వైజర్ జె.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రజక భవనానికి బోరు వేయించిన దిలీప్

**ఇచ్ఛాపురం, జూన్ 28(వార్త):** స్థానిక పాతలేశ్వర ఆలయ సమీపంలో గల సిద్దేశ్వర రజక సంక్షేమ సంఘ సామాజిక భవనం వద్ద 22 వ వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ యాదవ్ బోరును వేయించారు. తన సొంత సొమ్ముతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బోరును తవ్వించి అంకితం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో గల రజకులు దిలీప్‌ను అభినందించారు.



## సమస్యలన్నీ పరిష్కారిస్తాం : మంత్రి అచ్చెన్న

**-నిమ్మాడలో ప్రజాదర్బార్‌కు తరలివచ్చిన ప్రజలు**

**కోటబొమ్మాళి, జూన్ 28(వార్త):** నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడు శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజలు భారీగా తరలివచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకుని తమ సమస్యలు మంత్రి అచ్చెన్నాయుడికి వినిపించారు. ఉపాధి, విద్య, సంక్షేమం తదితర అంశాలపై పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి ఇది ఒక ప్రయత్నం అన్నారు. ఈ ప్రజాదర్బార్‌లో మత్స్యకార సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న విజ్ఞప్తులతో పాటు, కొత్త నివాసాలు మంజూరు చేయాలని, నూతన పింఛన్లు మంజూరు చేయాలని పెద్దఎత్తున ప్రజలు వినతులు అందజేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు కల్పించాలని, వసతిగృహాల్లో ప్రవేశం ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు వినతులు అందించారు.

కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.





## కేంద్ర మంత్రి రాముకు స్వాగతం పలికిన కలమట

**కొత్తూరు, జూన్ 28 (వార్త):** పాతపట్నం నియోజకవర్గంలోని హిరమండలం, కొత్తూరు మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనకు శనివారం విచ్చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు మాతల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కలమట .. స్థానిక తెదేపా నాయకులతో ఘనంగా స్వాగతం పలికారు. తన స్వగృహానికి తోడ్కొని వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా గోగుల జన్మదిన వేడుకలు



**కొత్తూరు, జూన్ 28 (వార్త):** తెలుగుదేశం నాయకులు, శ్రీ వరహా లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ధర్మకర్త గోగుల వరప్రసాదరావు నాయుడు జన్మదిన వేడుకలు కొత్తూరులో శనివారం ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థులకు పెన్సిళ్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీ వరహాలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 1000 మందికి పైగా అన్నప్రసాదం నిర్వహించారు. దేవుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## శక్తి యాప్‌పై అవగాహన



**నరసన్నపేట, జూన్ 28 (వార్త):** నరసన్నపేట గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో శక్తి యాప్ గురించి టెక్కలి డివిజన్ శక్తి టీం వారు శనివారం అవగాహన కల్పించారు. మహిళ భద్రతకు శక్తి యాప్ ఎలా ఉపయోగపడుతుందో వారు వివరించారు. కార్యక్రమానికి టెక్కలి డివిజన్ శక్తి టీం ఎస్ఐ బాలకృష్ణ, సభ్యులు, ప్రిన్సిపాల్ పవన్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రాముకు రెవెన్యూ ఉద్యోగుల వినతి



**కొత్తూరు, జూన్ 28 (వార్త):** కొత్తూరు మండలంలో శనివారం నాడు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పలు కార్యక్రమాలకు రావడంతో కొత్తూరు మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు వినతి పత్రాన్ని ఇచ్చారు. మండలంలో పనిచేయుచున్న గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ-సర్వే, ఇతర రెవెన్యూ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారు. అయితే, ప్రభుత్వం తీసుకున్న రేషనలైజేషన్‌లో జనాభా ప్రాతిపదికన రెండు సచివాలయాలకు ఒక క్లస్టర్‌గా చేసి కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులను కుదించడంతో, ప్రస్తుతం జరుగుతున్న భూ సర్వే, రెవెన్యూ విధులకు ప్రజలకు సరైన సమయంలో సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రెవెన్యూ గ్రామాల ప్రాతిపదికన రేషనలైజేషన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వైసీపీ నగర ప్రధాన కార్యదర్శిగా మహేంద్ర



**శ్రీకాకుళం, జూన్ 28 (వార్త):** వైసీపీ శ్రీకాకుళం నగర ప్రధాన కార్య దర్శిగా సీపాన మహేంద్రను నియమించారు. ఈ మేరకు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహేంద్రను నియమించడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మహేంద్ర మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కష్టపడతానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ధర్మాన ప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

**- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**-ఎల్ఎన్ పేట ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ**



**ఎల్ఎన్ పేట /హిరమండలం, జూన్ 28 (వార్త):** పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు అన్నారు. శనివారం నియోజకవర్గ పర్యటనలో భాగంగా హిరమండలం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణ నందు ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. హిరమండల మండల ప్రజలు, రైతులు త్యాగం చేయకపోతే ఈరోజు వంశధార రిజర్వాయర్ నిర్మాణం జరిగి ఉండేదికాదన్నారు. హిరమండల మండల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జడ్పీటీసి పొగిరిబుచ్చిబాబు, ఎంపీపి ప్రతినిధి తూలుగు తిరుపతిరావు తదితరులు హిరమండలంలో ఉన్న ప్రధాన సమస్యలు కోసం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం హిరమండలం పాత బస్టాండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రహదారి, కాలువలు కోసం ఆయన శంకుస్థాపనలు చేశారు.

అనంతరం ఎల్ ఎన్ పేట మండలంలో పర్యటించి స్థానిక మండల కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు వినతులను స్వీకరించారు. అక్కడ పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆయనకు సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమంత్రి శంకుస్థాపన

**కొత్తూరు, జూన్ 28 (వార్త):** పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు మంచి నీరు అందించేందుకు రూ.265 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న ఉద్దానం ఫేజ్ %-%2 మంచినీటి పథకానికి శనివారం శంకుస్థాపన జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మరియు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఈ కార్యక్రమంలో పాల్గొని భూమిపూజ చేశారు.

పాతపట్నం ప్రజలు అనేక దశాబ్దాలుగా మంచినీటి కొరతతో బాధపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తాగునీటి సమస్య పరిష్కారానికి ఈ ప్రాజెక్టు ప్రధాన పరిష్కారంగా మారనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు, మండల స్థాయి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**కేజీబీవీ అదనపు గదులకు...**

కొత్తూరు మండలంలోని వసప గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో రూ.2 కోట్ల 12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదులకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, నాణ్యత కలిగిన భవన వసతులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయి. ఈ గదులు విద్యార్థుల భద్రత, అభ్యాసానికి ఎంతో దోహదపడతాయి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు దాణా సబ్సిడీ కింద సహాయాన్ని పంపిణీ చేశారు. నూతనంగా అమలవుతున్న కేంద్ర సబ్సిడీ పథకాల ద్వారా రైతులకు తక్కువ ధరకే పశువుల దాణా అందుబాటులోకి రానుందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అగతముడి మాధవ రావు, దశరథ, టీడీపీ సీనియర్ నాయకులు మాతల గాంధీ, కాంట్రాక్టర్ పొగిరి అర్జున్, పడాల లక్ష్మణరావు, అగతముడి అరుణ్ బాబు, తొంపల తిరుపతి రావు, ముగితి కృష్ణ, యల్ జనార్దన మండల కూటమి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కీర్తిచక్ర పురస్కార గ్రహీతకు అచ్చెన్న అభినందన

**కోటబొమ్మాళి, జూన్ 28(వార్త):** విధి నిర్వహణలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరి పెంటకు చెందిన మేజర్ మల్లా రాంగోపాల్‌నాయుడును రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో శనివారం అభినందించారు. కుటుంబసభ్యులతో ఆయన క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాంగోపాల్ చూపిన ధైర్య సాహసాలను అభినందించారు. కీర్తిచక్ర పురస్కారం జిల్లాకు గర్వకారణమన్నారు.



# సభ్యులు అడిగిన వివరాలు అందజేయాలి

**-అధికారులకు జిల్లా పరిషత్ అధ్యక్షురాలు పిరియా విజయ ఆదేశం**

**శ్రీకాకుళం, జూన్ 28(వార్త):** సభ్యులు అడిగిన వివరాలను అందజేయాలని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు పిరియా విజయ ..జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభ్యులు 15వ ఆర్థిక సంఘం నిధులు వివరాలను అడగగా స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారి కె.భారతిసౌజన్య పంచాయతీల ద్వారా చేపడుతున్న పనుల గూర్చి సభ్యులకు తెలియజేయగా టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి మాట్లాడుతూ టెక్కలిలో శానిటేషన్ లేదని, లైట్లు వెలగడం లేదనగా, చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో తెలిపారు. రణస్థలం జడ్పీటీసీ సీతారాం మాట్లాడుతూ కొత్త పంచాయతీలకు నిధుల గూర్చి అడుగగా, ఆ జాబితా ఇస్తామని డీపీవో సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం హయాంలో పంచాయతీలకు వచ్చిన నిధులు ఏమయ్యాయని ఎచ్చెర్ల శాసన సభ్యుడు నడికుదిటి ఈశ్వరరావు నిలదీశారు. వంగర మండలంలో శానిటేషన్‌కు నిధులు లేవని వంగర ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ సభ దృష్టికి తీసుకువచ్చారు. సభ్యులు అడిగిన వివరాలకు సంబంధించి కాపీలు అందజేయాలని జడ్పీ చైర్మన్..డీపీవోను ఆదేశించారు. చెత్త తరలింపుపై మేజర్ పంచాయతీల నుంచి సేకరించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు డీపీవో చెప్పారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా పారిశుధ్యంపై దృష్టి సారించాలని డీపీవోను చైర్మన్ ఆదేశించారు.

**ఉపాధి హామీ పనులపై ..**

ద్వామా పీడీ సుధాకర్ ఉపాధి హామీ పనులపై సభ్యులకు వివరించారు. లావేరు జడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సరైన పనులు కల్పించేందుకు ఉపాధి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రైతులకు మేలు జరిగే పనులు చేయాలని కోరారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని జడ్పీ చైర్మన్ చెప్పగా ఫీల్డ్ స్టాఫ్‌కు మొక్కలు నాటేలా ఆదేశాలు జారీ చేయనున్నట్లు పీడీ వివరించారు.




రణస్థలం జడ్పీటీసీ సీతారాం మాట్లాడుతూ బీటీ రోడ్లు పక్కన చెరువులు ఉంటున్నాయని మట్టి వేయడంతో నీరు నిలబడి పోతుందని చెప్పగా తొలగించేందుకు ఫీల్డ్ స్టాఫ్‌కు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. గోకులాలకు సంబంధించి బిల్లులు అందలేదని సభ్యులు అడుగగా బిల్లులు అప్ లోడ్ చేసి బిల్లులు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లకు చేరేలా చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. సంతకవిటి మండలంలో ఫీల్డ్ ఆఫీసర్‌ను ఎందుకు సస్పెండ్ చేశారని జడ్పీ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్ మోహనరావు అడగగా విజయనగరం జిల్లా డ్వామా పీడీ మాట్లాడుతూ ఫీల్డ్ ఆఫీసర్ సస్పెండ్ విషయం తనకు తెలియదని చెప్పారు. వంగర మండలంలో ఫీల్డ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారని, ఎవరూ లేరని ఎవరినైనా వేయాలని వంగర ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ కోరగా, ఫీల్డ్ ఆఫీసర్‌కు చార్జ్ ఇవ్వనున్నట్లు పీడీ తెలిపారు.

**వ్యవసాయంపై..**

ఖరీఫ్ సీజన్‌లో సరఫరా చేసిన విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు, తదితరాలపై వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి సభ్యులకు వివరించారు. తక్కువ భూమి ఉన్న రైతులకు, 'డి' పట్టా భూములకు అన్నదాత సుఖీభవ వర్తించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సభ్యులు కోరాగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జేడీ వివరించారు. రైతులు ఇప్పటికీ ఈకేవైసీ చేసుకోలేదని చెప్పారు. డ్రోన్స్ వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని జడ్పీ చైర్మన్ జేడీకి సూచించారు. రణస్థలం మండలంలో అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడికుదిటి ఈశ్వరరావు కోరారు. రణస్థలం, లావేరు మండలాల్లో కొన్ని రహదారులు బాగా లేవని చెప్పగా, ఆ జాబితా అందజేయాలని జడ్పీ సీఈవో చెప్పారు. తోటపాలెం, కుశాలపురం గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో చేర్చడంతో ఉపాధి హామీ పనులు తదితరాలు రావడం లేదని, దీనిని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టామని ఎమ్మెల్యే ఈశ్వరరావు తెలిపారు. దీనిపై గజిట్ రావాల్సి ఉందని జడ్పీ సీఈవో తెలిపారు.

**విద్యుత్ శాఖపై ..**

కంచిలి మండలంలో డయాలసిస్ కేంద్రం ఉందని, అక్కడ 3 ఫీడర్లు ఉన్నప్పటికీ , విద్యుత్ సరఫరా సరిగా రావడం లేదని జడ్పీ చైర్మన్ చెప్పగా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. హుద్ హుద్ కాలనీకి విద్యుత్ సరఫరాకు అమౌంట్ పే చేస్తామన్నా పవర్ సప్లయ్ చేయడం లేదని కాలనీ వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారని టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి చెప్పగా అమౌంట్ పే చేస్తే పవర్ సప్లై చేస్తామని ఈపీడీసీఎల్ అధికారులు చెప్పారు.

**జల వనరుల శాఖపై ..**

జల వనరుల శాఖ చేపడుతున్న పనులను ఎస్ఈ సుధాకర్ వివరించారు. రణస్థలం మండలంలో ఉన్న సాగునీటి సమస్యలపై జడ్పీటీసీ సీతారాం అడగగా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నారాయణపురం కాలువల వద్ద షట్టర్లు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని, ఇప్పటికే నీరు సరఫరా అవుతుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అడుగగా 15 రోజుల్లో షట్టర్లు వేస్తామని ఎస్ఈ చెప్పారు. నాగావళి కుడి, ఎడమ కాలువలు ఆధునికీకరణ ప్రతిపాదనలు చేయగా గత ప్రభుత్వంలో మంజూరైనదని, కానీ అది కార్య రూపం దాల్చలేదని ఆ పనులు పునరుద్ధరించాలని, ఈ కాలువల ద్వారా సుమారు 70 ఎకరాలకు సాగునీరు అందుతోందని, ఆధునికీకరణ పనులు జరిగితే రైతులకు ఉపయోగక రంగా ఉంటుందని విక్రాంత్ అన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నారాయణపురం కాలువ నుంచి సాగునీరు, కళింగపట్నానికి నీరు ఎప్పుడు విడిచిపెడతారని ఎస్ఈని అడుగగా జూలై 15లోగా సాగునీరు విడిచిపెడతామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖలపై సభ్యులు మాట్లాడారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజ, జడ్పీటీసీలు, ఎంపీపీలు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీ పురం మన్యం జిల్లాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరందించడంలో ప్రభుత్వం విఫలం

**- ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన అసమర్థ పాలకులు**

**- మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి**

**కొత్తూరు, జూన్ 28 (వార్త):** తాగునీరు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అసమర్థ పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. శనివారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్దానం మంచినీటి పథకం ప్రాజెక్టు (వై.ఎస్.ఆర్. సుజలధార)కు పాతపట్నం నియోజకవర్గానికే రూ. 265 కోట్లు కేటాయించడం ఎంత గొప్ప విషయమని గుర్తు చేశారు.

ప్రస్తుత కూటమి నాయకులు పాతపట్నం నియోజకవర్గం వచ్చి కేవలం హంగులకూ, ఆర్భాటాలకూ, వైభోగాలకూ మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రజల తాగునీటి కష్టాలను పట్టించుకోవడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, వారి సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజలు గమనిస్తున్నారని ఆమె అన్నారు.



## మహా టీవీ కార్యాలయంపై దాడికి నిరసన



**శ్రీకాకుళం, జూన్ 28 (వార్త):** హైదరాబాదులో మహా టీవీ కార్యాలయంపై బీఆర్ఎస్ కార్యకర్తల దాడిని నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులంతా నిరసన ప్రదర్శన చేశారు. దీనికి ప్రజా సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటించారు.. . మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఈ సంఘటనపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకేంద్ర హొమ్ శాఖ వెంటనే జోక్యం చేసుకుని దాడిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు బెజ్జిపురపు రమేష్, జి.ప్రశాంత్, చిన్నారావు, జాడ సంతోష్, కె.కొండబాబు, వజ్జ నాగరాజు, సూర్య, డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, ప్రజా సంఘాల నేత బి.తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.. శ్రీకాకుళం నగరంలో అంబేద్కర్ జంక్షన్ నుండి డే అండ్ నైట్ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. బీఆర్ఎస్ పార్టీ నశించాలి.. నశించాలి అంటూ నినాదాలు చేశారు. మహా టివి కార్యాలయంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి.. మీడియా స్వేచ్ఛను కాపాడాలని కోరారు.

# రంగస్థల కళాకారులకు ప్రభుత్వం అండ

**- శాసనసభ్యులు గొండు. శంకర్**

**శ్రీకాకుళం, జూన్ 28(వార్త):** రంగస్థల కళాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎస్పీ బంగ్లా దారిలోగల శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నూతన భవనం ప్రారంభోత్సవంలో శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని నటరాజ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. శ్రీకాకుళంలో కళాకారులకు కొదవలేదని, జిల్లా నుంచి సినీ రంగంలోకి అనేకమంది కళాకారులు వెళ్లి, సుస్థిర స్థానం సంపాదించారన్నారు. సమాఖ్యకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. టీడీపీ ఉపాధ్యక్షులు పీఎంజే బాబు ఇండోర్ స్టేడియం ఉండాలనే అంశాన్ని పరిశీలించామని అడిగారని, అందుకు ఇదివరకే ప్రణాళిక సిద్ధం చేశామని, త్వరలో కార్యాచరణ జరిగేలా చూస్తానన్నారు. అనంతరం కళాకారుల సమాఖ్య సభ్యులందరూ శంకర్‌ను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు ఎల్.రామ లింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, రామచంద్ర దేవ్, పీఎంజె బాబు, చిట్టి నాగభూషణం, రమణారావు, కవ్వాడి సుశీల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.





ఆమదాలవలసలోని పవనపుత్ర వ్యాయామమండలి ఆధ్వర్యంలో విద్యార్థిని లక్ష్మీగాయత్రిని కోచ్ జె.శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. విద్యలో ముందుకు సాగాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటేష్, బి.కూర్మారావు, పి.చక్రపాణి, ముత్తా విజయ్, కె.సూర్యప్రకాశరావు, శ్రీకాంత్, చిన్ని, పవన్, సాహిల్, ఉపాధ్యాయిని ప్రేమకుమారి దంపతులు, జిమ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**–ఆమదాలవలస**

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546